# సాయిమధురానగర్ అభివృద్ధికి కృషి



సాయిమధురానగర్‌లో కార్పొరేటర్ బి.పద్మారెడ్డితో కలిసి సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, మే 15 : బాగ్‌అంబర్‌పేట డివిజన్ బతుకమ్మ కుంట, సాయిమధురానగర్ సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బస్తీలను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతానని చెప్పారు. రూ.38 లక్షలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బస్తీలో అంచెలంచెలుగా ఒక్కో పనిని చేస్తున్నామని తెలిపారు. కొన్ని నెలల క్రితమే బస్తీలో నూతన డ్రైనేజీ వ్యవస్థను రూపొందించామన్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ ఏర్పాటుతో రోడ్డు అధ్వానంగా మారిందని, అందుకే రూ.38 లక్షలతో నూతన సీసీ రోడ్డును నిర్మిస్తున్నామని చెప్పారు. అలాగే వరదనీటి సమస్యను కూడా త్వరలోనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ప్రతి బస్తీని అభివృద్ధి చేయడం జరిగిందని వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వంతో కొట్లాడి నిధులు తీసుకొస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు బి.వెంకటరెడ్డి, శ్రీరాములు ముదిరాజ్, అఫ్రోజ్‌పటేల్, టి.రమేష్, మిర్యాల రవీందర్, పి. చంద్రశేఖర్‌గౌడ్, కనివేట నర్సింగ్‌రావు, పి.కిషోర్, జె. బాల్‌రాజు, డి.రాంచందర్, నరహరి, కోట్ల సంతోష్, సునీల్, విజయ్, కెంచె మహేశ్, కె. శ్రీహరి, రమేశ్, గోవిందు అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయండి



మూసారాంబాగ్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్

గోల్నాక, మే 15: మూసారాంబాగ్ బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే పూర్తి చేయాలని బీఆర్ఎస్ నాయకుడు దూసరి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన మూసారాం బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జాప్యం వల్ల స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, పనుల్లో వేగం పెంచి త్వరలో బ్రిడ్జిని అందుబాటులోకి తీసుకురావాలని ఆయన సంబంధిత అధికారులను కోరారు.

## కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



జీహెచ్ఎంసీ కమిషనర్‌తో మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్

మెహిదీపట్నం, మే 15 : ప్రజల అభివృద్ధికి అధికారులు కృషి చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్, బహదూర్‌పుర ఎమ్మెల్యే ముబీన్ లు కలిశారు. నియోజకవర్గాలలో జరుగుతున్న అభివృద్ధి పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, పలు పనులు పెండిగ్‌లో ఉన్నాయని వారు కమిషనర్‌కు వివరించారు. దీనికి సానుకూలంగా స్పందించిన కమిషనర్ సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటానని అన్నారు.

## గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ సెక్రటరీపై చర్యలు తీసుకోవాలి

మెహిదీపట్నం, మే 15 : మార్కెట్లో అవకతవకలకు పాల్పడుతున్న గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ సెక్రటరీ శ్రీనివాస్‌పై చర్యలు తీసుకోవాలని కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి ఠాకూర్ జీవన్‌సింగ్ అన్నారు. మార్కెటింగ్ శాఖ డైరెక్టర్ శరత్‌ను జీవన్‌సింగ్ కలిసి ఫిర్యాదు చేశారు. గుడిమల్కాపూర్ మార్కెట్‌లో కార్యదర్శి శ్రీనివాస్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ అవకతవకలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. దీనికి సానుకూలంగా స్పందించిన డైరెక్టర్ శరత్ విచారణ చేసి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

## పేద విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

గోల్నాక, మే 15: విద్యార్థులకు వేసవి సెలవుల నేపథ్యంలో ఆడుకునేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. గురువారం అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ్ ముదిరాజ్ పలువురు పేద విద్యార్థులకు క్రికెట్ బ్యాట్లు, వికెట్లు, షెటిల్‌బాల్స్, బ్యాట్స్ తదితర క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నజయ్ ముదిరాజ్, ఆకుల మల్లేశ్, నరేంద్ర ముదిరాజ్, బొట్టు మహేశ్‌గౌడ్, దశరథ్, సురేశ్ ముదిరాజ్, కాశిరెడ్డి పాల్గొన్నారు.



న్యూపటేల్‌నగర్‌లో విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకుడు సిద్ధార్థ్ ముదిరాజ్

## మైసూర్ రైల్లో దొంగతనం

కాచిగూడ, మే 15: మైసూర్ రైల్లో దొంగతనం జరిగింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. చెంగిచెర్లకు చెందిన కసిరెడ్డి రాజశేఖర్(34) ప్రైవేటు ఉద్యోగి. మైసూర్ రైల్లో కాచిగూడకు వస్తుండగా మలక్ పేట రైల్వే స్టేషన్‌లో తన బ్యాగు చూసుకునేసరికి అందులో ఉన్న ఖరీదైన ల్యాబ్ ట్యాప్, డ్రైవింగ్ లైసెన్స్, ఏటీఎం కార్డులు, ఆధార్ కార్డు కనిపించలేదు. రాజశేఖర్ ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## వీధి లైట్లకు మరమ్మతులు చేయండి

● కబేళా, హర్రస్ పెంట నుంచి నింబోలిఅడ్డ ఎక్స్‌రోడ్ వరకు వెలుగని వీధిలైట్లు
● అవస్థలు పడుతున్న స్థానికులు ● పటించుకోని అధికారులు



వీధిలైట్లు వెలుగకపోవడంతో చీకటిగా మారిన హర్రస్ పెంట ప్రధాన రోడ్డు

కాచిగూడ, మే 15 : గోల్నాక డివిజన్ లోని కాచిగూడ కబేళా, హర్రస్ పెంట నుంచి నింబోలి అడ్డ ఎక్స్ రోడ్ వరకు ప్రధాన రహదారిలో కొన్ని రోజులుగా స్ట్రీట్ లైట్లు, ఐమాస్ట్ లైట్లు వెలుగకపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలు అంధకారంగా మారాయి. ఈ రోడ్డు నుంచి ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సుందర్ నగర్, కృష్ణానగర్, శ్యామ్‌నగర్, కబేళా, తదితర రహదారి ప్రాంతాల్లో స్ట్రీట్ లైట్లు వెలుగకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో స్ట్రీట్ లైట్ వెలుగకపోవడంతో దొంగతనాలు, యాక్సిడెంట్లు జరిగిన సంఘటన ఉన్నాయన్నారు. అంతేగాక మహిళలు సాయంత్రం అయితే బయటికి వెళ్లలేని పరిస్థితి నెలకొందని తెలిపారు. అయినప్పటికీ విద్యుత్ అధికారులు నిమ్మకు నేరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని స్థానికుల ఆ వేదన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం సిబ్బంది, ఏఈకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారిలోని స్ట్రీట్ లైట్లకు మరమ్మతులు చేయించి, వాడుకలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

## డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు



నరేంద్రనగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్

గోల్నాక, మే 15: అంబర్ పేట డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో స్తానికులను వేధిస్తోన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. డివిజన్‌లోని నరేంద్రనగర్‌లో డ్రైనేజీ సమస్యతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామన్న స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం ఆయన సమస్యను పరిశీలించారు. వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి డ్రైనేజీ మ్యాన్ హోళ్లలో పేరుకు పోయిన వ్యర్థాలను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం కోసం డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కొత్త పైప్ లైన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి ఏఈ ప్రదీప్ కుమార్, సిబ్బంది రాజేశ్, స్థానిక నాయకులు చంద్రయ్య, చిన్న, నరేంద్రచారి, భాస్కర్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## పనులను పర్యవేక్షించినప్పుడే అభివృద్ధి



లింగంపల్లిలో చేపట్టిన రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఉమాయాదవ్, అధికారులు

కాచిగూడ, మే 15: అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించినప్పుడే నాణ్యమైన అభివృద్ధి పనులు జరుగుతాయని కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్ అన్నారు. లింగంపల్లిలో నూతనంగా వేస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం కార్పొరేటర్, జీహెచ్ఎంసీ డీఈ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో రమేశ్‌యాదవ్, ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌యాదవ్, ఎం. నర్సింగ్ రావు, అరవింద్, వాసు, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీ



అంబర్‌పేటలో నిర్వహించిన తిరంగ ర్యాలీలో పాల్గొన్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి

గోల్నాక, మే 15 : ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా నిర్వహించడం దేశానికి గర్వకారణమని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. భారత సైనికులకు సంఘీభావంగా గురువారం గోల్నాక భారత్ ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారీ జాతీయ పతాకంతో తిరంగా ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీ అంబర్‌పేట మహారాణా ప్రతాప్ ఫంక్షన్ హాల్ నుంచి గోల్నాక చౌరస్తా వరకు కొనసాగింది. చేనంబరు చౌరస్తాలో అమరులకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి నివాళులర్పించి మాట్లాడుతూ.. పహల్గాంలో అమాయక ప్రజల ప్రాణాలు తీసిన ఉగ్రవాదులపై భారత సైన్యం ప్రతీకారం తీర్చుకుందని ప్రశంసించారు. ఉగ్రవాద శిబిరాలపై ఆపరేషన్ సిందూర్ పేరుతో జరిపిన దాడి ఉగ్రవాద నిర్మూలనలో భారత నిబద్ధతకు నిదర్శనమన్నారు. తీవ్రవాదాన్ని పూర్తిగా నిర్మూలించే క్రమంలో దేశ రక్షణకు ఇది కీలకమైన అడుగు అని కిషన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సి.కృష్ణయాదవ్, డాక్టర్ గౌతంరావు, ఏడెల్లి అజయ్ కుమార్ కార్పొరేటర్లు అమృత, దూసరి లావణ్య శ్రీనివాస్ గౌడ్, మూల రవీందర్ గౌడ్, నాగభూషణం చారి తదితరులతో పాటు పెద్ద ఎత్తున స్థానికులు పాల్గొన్నారు.

## వైన్ షాపులు మూసివేయండి

మెహిదీపట్నం, మే 15 : ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న వైన్ షాపులు, బార్‌లు, కల్లు కాంపౌండ్‌ల ను మూసివేయాలని నాంపల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ డిమాండ్ చేశారు. ఆసిఫ్ నగర్ జిర్రా ప్రధానరోడ్‌లో ఉన్న చంద్ర వైన్స్, శ్రీబాలాజీబార్, కల్లు కాంపౌండ్‌ల కారణంగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఇటీవల ఓ యువకుడి మృతికి బార్ యాజమాన్యం నిర్వాకమే కారణమని ఎమ్మెల్యే మండిపడ్డారు. బుధవారం రాత్రి స్థానికులతో కలిసి ఎమ్మెల్యే మాజీ దుస్సేన్ వైన్స్, బార్, కాంపౌండ్ మూసి వేయించారు. ఇక్కడ 25 మీటర్ల దూరంలో మొత్తం మద్యం దుకాణాలు ఉన్నాయని, ఉన్నతాధికారులతో మాట్లాడి మూసివేయిస్తానని స్థానికులకు ఎమ్మెల్యే చెప్పారు. ఎమ్మెల్యేను ఆసిఫ్ నగర్ ఏసీపీ విజయ శ్రీనివాస్, సీఐ ఆనంద్ లు సముదాయించారు. ఇదిలా ఉండగా గోల్కొండ ఎక్సైజ్ సీఐ శ్రావణి ని ఆసిఫ్‌నగర్‌లో మద్యం దుకాణాలకు అనుమతుల గురించి ప్రశ్నించగా అన్ని నిబంధనల ప్రకారమే ఉన్నాయని చెప్పారు.

## మల్లేపల్లిలో అభివృద్ధి పనులు చేపట్టండి



ప్రజలకు సౌకర్యాలు కల్పించడానికి చేపట్టిన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయడానికి తగిన చర్యలు తీసుకుంటానని జీహెచ్ఎంసీ సర్కిల్ 12 డిప్యూటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం మల్లేపల్లి డివిజన్ ఎంఐఎమ్ నాయకుడు జాఫర్ ఖాన్ డిప్యూటీ కమిషనర్‌ను కలిసి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనుల గురించి చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి పనులను వెంటనే పూర్తి చేయించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు.

– మెహిదీపట్నం మే 15

## హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సుల (బీహెచ్ఎంసీటీ, బీసీటీసీఏ) పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్లాగ్ పరీక్షలను ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీపీఈడీ, డీపీఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలతో పాటు బ్యాచిలర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www. osmania.ac.inలో చూసుకోవాలని సూచించారు.

## బీఈ కోర్సుల వన్ టైం చాన్స్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని విభాగాల బీఈ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిపోయిన వారికి వన్ టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఓయూ అకాడమిక్ సెనేట్ స్టాండింగ్ కమిటీ అనుమతించిందని చెప్పారు. 2000 సంవత్సరం తరువాత ఆయా కోర్సుల్లో చేరినవారు సైతం తమ బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు అవకాశమిచ్చామన్నారు. ఈ కోర్సుల అన్ని సెమిస్టర్ల పరీక్ష ఫీజును ఈ నెల 24వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుముతో కలిపి 27వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతో పాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్ష విధానంలోనే వారు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.omania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

## బీఈ చివరి సెమిస్టర్ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని బీఈ చివరి సెమిస్టర్ పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. బీఈ (ఏఐసీటీఈ) ఎనిమిదో సెమిస్టర్ మెయిన్, బ్యాక్ లాగ్, బీఈ (సీబీసీఎస్), బీఈ (నాన్ సీబీసీఎస్) చివరి సెమిస్టర్ బ్యాక్లాగ్ పరీక్ష ఫీజును ఈ నెల 24వ తేదీలోగా సంబంధిత కళాశాలలో చెల్లించాలని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుముతో 27వ తేదీ వరకు చెల్లించవచ్చునని అన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని వారు తెలిపారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవాలని ప్రొఫెసర్ శశికాంత్ సూచించారు.

## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



కూచిపూడి నృత్యప్రదర్శన చేస్తున్న చిన్నారులు

రవీంద్రభారతి, మే15 : అక్షిత ఫౌండేషన్ మరియు నటరాజ్ అకాడమీ ఆధ్వర్యంలో 17వ వార్షికోత్సవం సందర్భందగా గురువారం రవీంద్రభారతిలోని మెయిన్‌హాల్‌లో ఐకాన్ అవార్డులు జైహింద్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వక్తలుగా బీఆర్ఎస్ నేత ఎర్రోళ్ల శ్రీనివాస్, డా.ఆలేటి శ్రీనివాస్‌గౌడ్, తుంగతుర్తి రవి, ఆర్. వరప్రసాద్, ఆమని ములుగు, మద్దెల సందీప్‌కుమార్, నటరాజ్ వ్యవస్థాపకుడు నల్లా గిరి విచ్చేసి జ్యోతి ప్రజ్వలనం చేసి పలువురు నృత్య కళాకారులకు ఐకాన్ అవార్డులను బహూకరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కూచిపూడి, భరతనాట్యం మన దేశ వారసత్వ సంపదని, ఈ కళలు మన సాంస్కృతి,సాంప్రదాయాలను పరిరక్షిస్తున్నాయని పేర్కొన్నారు.ప్రాచీన కళలను భావితరాలకు అందించాల్సిన అవశ్యకత గురువులపై ఉందన్నారు. ఎందరో గొప్ప గొప్ప మహనీయులు శాస్త్రీయ లలిత కళలను భవిష్యత్ తరాలకు అందించారని చెప్పారు. సభకు ముందు చిన్నారుల కూచిపూడి, భరతనాట్య ప్రదర్శన వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు నల్ల గిరి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ డిపోలో త్రైమాసిక రీజినల్ అవార్డుల ప్రదానం



హైదరాబాద్ డిపోలో త్రైమాసిక రీజినల్ ఆవార్డులు అందుకున్న డ్రైవర్లు, కండక్టర్లు

జియాగూడ, మే 15 : హైదరాబాద్ డిపోలో త్రైమాసిక ప్రగతి చక్రం, త్రైమాసిక రీజినల్ ఆవార్డుల ప్రదాన కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన రంగారెడ్డి రీజియన్ డ్రైవర్లు, కండక్టర్లు, మెయింటెనెన్స్ సిబ్బందికి రీజినల్ మేనేజర్ ప్రశంసా పత్రాలు, నగదు పురస్కారాలు అందజేశారు. ముఖ్య అతిథిగా రంగారెడ్డి రీజినల్ మేనేజర్ శ్రీలత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ సరస్వతి, పర్సనల్ అధికారి శ్రీనివాస్, కస్టమర్ రిలేషన్ మేనేజర్ శ్రీనివాస్, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

## 18వ తేదీ వరకు సన్న బియ్యం పంపిణీ

అబిడ్స్, మే 15 : జంట నగరాలలోని ఆహార భద్రత కార్డుదారులకు ఈ నెల 18వ తేదీ వరకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని హైదరాబాద్ జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఏ రమేష్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మే మొదటి తేదీ నుంచి ఆహార భద్రత కార్డుదారులకు రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. హైదరాబాదులోని ఆహార భద్రత కార్డు దారులకు 14334.678 మెట్రిక్ టన్నుల బియ్యం కోటాలను విడుదల చేయడం జరిగిందని అన్నారు. మే 15వ తేదీ వరకు 596925 కార్డుదారులు 13805.320 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేసినట్లు వివరించారు. బియ్యం తీసుకున్నారని తెలిపారు మిగిలిన వారు కూడా సన్నం బియ్యం తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం మే 18 వ తేదీ వరకు పంపిణీ చేయాలని నిశ్చయించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆహార భద్రత కార్డుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## పోస్టర్ ఆవిష్కరణ..



తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జి.వి. ఆర్. కరాటే అకాడమీ వ్యవస్థాపకుడు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన నిర్వహించ బోయే కరాటే ప్రపంచ రికార్డు ప్రదర్శనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి, జి . ఎస్. గోపాల్‌రెడ్డి, కరాటే మాస్టర్లు ఉన్నారు.

–కాచిగూడ, మే 15

## వ్యక్తి ఆత్మహత్య

గోల్నాక, మే 15 : వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక ఇందిరానగర్‌కు చెందిన మొహమ్మద్ మన్సూర్ కూమారుడు కబీర్‌కు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. అతడు ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కాగా.. కొంత కాలంగా మంచి ఉద్యోగం దొరకడం లేదని మనస్తాపం చెందిన కబీర్ గురువారం తెల్లవారు జామున తన గదిలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి మన్సూర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.